
www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 10 జులై 2025

5

తిరుపతి



## బిగ్, జనతా క్యాంటీన్లలో నాణ్యత పాటించాలి : ఈవో

**ప్రజాశక్తి -తిరుమల**

తిరుమలలో శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు బిగ్, జనతా క్యాంటిన్లలో నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని టిటిడి ఈవో జె. శ్యామల రావు కోరారు. టిటిడి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో గుర్తింపు ఉన్న హెూటళ్ల నిర్వాహకులతో బుధవారం టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈవో మ్మాట్లాడుతూ శ్రీవారి దర్శనం కోసం ప్రపంచ వ్యాప్తంగా భక్తులు వస్తుంటారని, వారికి సేవా దక్పథంతో నాణ్యమైన ఆహార పదార్థాలు, పరిశుభ్రత, లాభాపేక్ష లేకుండా నిర్దేశించిన ధరలకు అందించాలన్నారు. తిరుమలలో బిగ్, జనతా క్యాంటిన్ల నిర్వహణ కోసం గత నెల 23వ తేదీ నోటిఫిషన్ జారీ చేశారు. హెూటళ్ల నిర్వాహకులు పలు సందేహాలు వ్యక్తం చేయగా వాటిని టిటిడీ ఈవో, అదనపు ఈవో నివత్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎఫ్.ఏ.ఓ రవి ప్రసాదు, తిరుమల ఎస్టేట్ ఆఫీసర్ కె. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# 'సార్వత్రిక' సమ్మె 'సక్సెస్'

## లేబర్ చట్టాల రద్దుపై నిరసన గళం
## దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ
## మోడీ, అమిత్‌షా ప్రజాద్రోహులు
## పనిగంటలు హరించిన చంద్రబాబు

**ఉద్యోగ, కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె విజయవంతంగా ముగిసింది. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలైన పోస్టల్, ఎల్ఐసి, బ్యాంకింగ్ సంస్థలు మూతబడ్డాయి. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు వేలాదిగా రోడ్లపైకి వచ్చి ప్రదర్శనలు, మానవహారాలు, సభలతో నిరసన తెలిపారు. యూనివర్సిటీల్లో విద్యార్థిసంఘాలు నినదించాయి. తిరుపతి బాలాజీ కాలనీలో వినూత్నంగా నల్లదుస్తులు, నల్లగొడుగులతో వినూత్నంగా నిరసన తెలిపారు. మోడీ, అమిత్‌షా ప్రజాద్రోహులంటూ లేబర్‌కోడ్‌ల రద్దుపై నిరసన గళం వెల్లువెత్తింది.. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమల్లో ఉందని, పని గంటలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హరించివేశారని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అన్నారు. జిల్లావ్యాప్తంగా 34 మండలాల్లోనూ సార్వత్రిక సమ్మె సక్సెస్ అయ్యింది. సార్వత్రిక సమ్మెకు సూళ్లూరుపేటలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు సంఘీభావం ప్రకటించారు.**

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్, తిరుపతి సిటీ, యంత్రాంగం**

దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తూ మోడీ అమిత్‌షాలు ప్రజాద్రోహులుగా మిగిలిపోతున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మండిపడ్డారు. సార్వత్రిక సమ్మె భారీ ర్యాలీ తిరుపతి పురవీధుల్లో సాగింది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం నుంచి భారీ ర్యాలీ నాలుగు కాళ్ల మండపం వరకూ సాగింది. బహిరంగసభలో కె.నారాయణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు పి.వెంకటరత్నం మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాసేలా నాలుగు లేబర్‌కోడ్స్‌ను తీసుకురావడం దుర్మార్గమన్నారు. సంఘం పెట్టుకోవాలంటే ఇకపై వీల్లేదన్నారు. ప్రశ్నించే హక్కు లేదన్నారు. 17 లక్షల కోట్ల రూపాయలు బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని ఎగ్గొట్టి లండన్‌లోనూ, కెనడాలోనూ జల్సాలు చేస్తున్న వారంతా మోడీ దత్తపుత్రులేనని అన్నారు. 29 మందిలో 28 మంది గుజరాతీలేనని అన్నారు. ఒక్క విజయమాల్యా మాత్రమే కర్నాటక వాస్తవ్యుడని చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థలన్నీ అదానీ అంబానీలకు అమ్మేస్తూ, పర్మినెంట్ ఉద్యోగులు లేకుండా చేస్తున్నారన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి ఆఫీసులోనూ ఔట్‌సోర్సింగ్ వాళ్లే ఉన్నారన్నారు. పర్మినెంట్ ఉద్యోగులు లేకపోవడం ప్రమాదానికి దారిస్తుందన్నారు. ఔట్‌సోర్సింగ్ వారు టెర్రరిస్టులకు అమ్ముడుపోయి బాంబులు పెట్టి వెళ్లిపోతే దానివల్ల ఎంత ప్రమాదం వాటిల్లుతుందో ముఖ్యమంత్రికి తెలియదా అని ప్రశ్నించారు. శాశ్వత ఉద్యోగ నియామకాలు చేయాలన్నారు. టిటిడిలో 16వేల మంది పర్మినెంట్ ఉద్యోగులు ఉండే అవకాశం ఉన్నా, ప్రస్తుతం కేవలం 5వేల మంది మాత్రమే ఉన్నారన్నారు. మిగిలినవారంతా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులేనన్నారు. కార్మికుల ఆందోళనలతో కేంద్ర ప్రభుత్వం వినకపోతే మోడీకి ఘోరీ కడతామని హెచ్చరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎనిమిది గంటల పనిదినాన్ని రద్దు చేస్తూ 10 గంటల పని దినాన్ని తీసుకొచ్చేలా క్యాబినెట్‌లో చట్టం చేయడం చంద్రబాబుకు తగదన్నారు. రాత్రుల్లో మహిళా షిఫ్ట్‌లకు ఆమోదం తెలపడం వల్ల భద్రత ఉండదన్నారు. కార్మికుల పోరాటంలో మోడీలో మార్పు రావాలని, లేకుంటే 2029లో మోడీని ఇంటికి పంపడం ఖాయమని హెచ్చరించారు. ఈ సమ్మెలో నాయకులు ఎ.రామానాయుడు, పెంచలయ్య, రాధాక్రిష్ణ, వేణుమాధవ్, సుబ్రమణ్యం, మాధవ్, బుజ్జమ్మ, చిన్నా, రామిశెట్టి వెంకయ్య, విజయ్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాగరాజమ్మ, ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.హేమలత పాల్గొన్నారు.

– టిటిడి పరిపాలనా భవనం వద్ద స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గోల్కొండ వెంకటేశం, కాటా గుణశేఖర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సూపర్‌వైజర్ యూనియన్ నాయకులు రఘు, త్యాగ, ఏకాంబరం, బాబూరావు, ప్రభాకర్, సిద్దు, కేశవులు పాల్గొన్నారు.

– ఎస్వీ యూనివర్సిటీ పరిపాలనా భవనం ముందు విద్యార్థిసంఘాలు నిరసన తెలిపాయి. తమ తల్లిదండ్రుల పని దినాలపై దాడిని తాము ఒప్పుకోమంటూ హెచ్చరించారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్‌రవి, అధ్యక్షులు అక్బర్, ఎఐఎస్ఎ జిల్లా కార్యదర్శి చిన్న, పిడిఎస్ఒ జిల్లా కార్యదర్శి ఆశ, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి లోకేష్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున పాల్గొన్నారు.

– తిరుపతి ఆంధ్రాబ్యాంక్ రామానుజ సర్కిల్ శాఖ వద్ద బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో గంటసేపు నిరసన తెలిపారు. టిబిఇసిసి ప్రధాన కార్యదర్శి ధన్వంత్‌కుమార్, అధ్యక్షులు విజయభాస్కర్ ధర్నాలో పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరించరాదని, రుణం ఎగ్గొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జనార్ధన్, సుమలత, భాస్కర్, నందగోపాల్ పాల్గొన్నారు.

– అప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.చిన్నబాబు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ జేఏసీ జి.నాగ వెంకటేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి నేతృత్వంలో జ్యోతిరావుపూలే విగ్రహం నుంచి నాలుగుకాళ్ల మండపం వరకూ నల్లగొడుగులు, నల్లదుస్తులతో నిరసన, మానవహారం నిర్వహించారు. అమర, శాంతమ్మ, పద్మిని, ప్రభాకర్‌రెడ్డి, మునెయ్య, రాజేంద్ర, గణేష్, మునిలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు. పాకాలలో నాయకులు ప్రకాష్, మధుసూదనరావు నేతృత్వంలో నిరసన జరిగింది.

– మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. 200 మంది యూనియన్ సభ్యులు పాల్గొన్నారని రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఎం.ఆనంద్, బి.కిరణ్, రవీంద్రారెడ్డి తెలిపారు.

– **శ్రీకాళహస్తిలో** సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, ఎఐటియుసి జిల్లా నాయకులు మురళి, ఐఎఫ్‌టియు జిల్లా నాయకురాలు జి.భారతి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ అతిథిగృహం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. పెనగడం గురవయ్య, గంధం మణి, మల్లికార్జున్, జాకీర్త పాల్గొన్నారు. బిఎన్ కండ్రిగలో ఎంపిడిఒ కార్యాలయం నుంచి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.రమణయ్య ఆధ్వర్యంలో బాలగురవయ్య, సుబ్బయ్య, తిరుపాలయ్య, రమణయ్య ర్యాలీ నిర్వహించారు. నాగలాపురంలో కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, ఉపాధి కూలీలకు 200 పనిదినాలు కల్పిస్తూ 600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి ఆర్.మురగేష్, జయంతి, సావిత్రి పాల్గొన్నారు.


సూళ్లూరుపేటలో..

వరదయ్యపాలెంలో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో బ్యాంకులు, పోస్టాఫీసుల ముందు నిరసన తెలిపారు.

– **నాయుడుపేటలో** సిఐటియు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు లక్ష్మి, మండల నాయకులు శివకవి ముకుంద, మహేష్‌బాబు, ఎన్.శ్యామలమ్మ, సుజాత పాల్గొన్నారు. – వాకాడు మండల పరిషత్‌కార్యాలయ ప్రాంగణంలోనూ, బ్యాంకుల వద్ద నిరసన తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ సందీప్‌కు వినతిపత్రం సమర్పించారు.


– **వెంకటగిరిలో** విశ్వోదయ కళాశాల గ్రౌండ్‌నుంచి ర్యాలీగా మండల పరిషత్ కార్యాలయం వరకూ వచ్చి సభ నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, పోతుగుంట మునిరాజా, ఎ.మంజుల, ఎఐటియుసి నాయకులు పి.బాలకృష్ణయ్య, ఎఐఎఫ్‌టియు (న్యూ) నరసింహులు నాయకత్వం వహించారు. – బాలాయపల్లిలో సిఐటియు ప్రాజెక్టు కార్యదర్శి ఎన్.స్వరూపరాణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

– **గూడూరు టౌన్‌లో..** అశోక్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రదర్శన నిర్వహించారు. టవర్‌క్లాక్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వం వహించారు. ప్రభాకర్, జోగి శివకుమార్, శశికుమార్, పామంజి మణి పాల్గొన్నారు.

– **రేణిగుంటలో..** సిఐటియు కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం మీదుగా ప్రదర్శనగా వెళ్లి ఆర్టీసీ బస్టాండ్ గాంధీ విగ్రహం సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్‌రావు నేతృత్వం వహించారు. సెల్వరాజ్, ధనమ్మ, లక్ష్మి, మునిరామయ్య, ఈశ్వరమ్మ, ఒ.వెంకటరమణ పాల్గొన్నారు. ఏర్పేడులో సిఐటియు నాయకులు కరీముల్లా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వెంకటేశ్వరరావు, రాంబాబు, రంగయ్య, బాలకృష్ణ, వెంకటాద్రి పాల్గొన్నారు. ఆలిండియా రైల్వే రిటైర్డ్ మెన్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రైల్వే విశ్రాంతి ఉద్యోగులు నిరసన తెలిపారు.

– **సత్యవేడు** తహశీల్దార్ కార్యాలయం నుంచి శ్రీకాళహస్తి బస్టాండ్ వరకూ సిఐటియు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు, గ్రీన్‌అంబాసిడర్లు, భవన నిర్మాణ, ఆటో, ఆషా, పారిశుధ్య కార్మికులు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మెలుగు రమేష్ నేతృత్వం వహించారు. శ్రీసిటీ పరిధిలోని పారిశ్రామికవాడల్లో ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని డిమాండ్‌చేశారు. కెవిబిపురం సిఐటియు ప్రాంతీయ కార్యదర్శి నాగలాపురం నాగరాజు, అంగన్‌వాడీ నాయకురాలు రాజేశ్వరి నేతృత్వంలో నిరసన తెలిపారు. పిచ్చాటూరులో సాయిబాబా గుడి నుంచి బస్టాండ్ వరకూ వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

– **పుత్తూరులో** సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్, ఎఐటియుసి జిల్లా నాయకులు డి.మహేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద ర్యాలీ, మహాధర్నా నిర్వహించారు. ఎల్ఐసి కార్యాలయం నుంచి ప్రదర్శన నిర్వహించారు. మునికుమారి, విజయకుమారి, రవి, విజయ్ పాల్గొన్నారు.


తిరుపతి సభలో కె.నారాయణ, కందారపు మురళి


శ్రీకాళహస్తిలో...


రేణిగుంటలో..


నాయుడుపేటలో..


పుత్తూరులో..





టిటిడి ఉద్యోగులు


పిచ్చాటూరులో..



మెడికల్ రెప్స్


నాగలాపురంలో ఉపాధి కూలీలు



గూడూరులో..

## అమరావతి నిర్మాణ స్ఫూర్తితో తుడా అభివృద్ధి

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**

అమరావతి నిర్మాణ స్పూర్తితో తుడా పరిధిలోని ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి అన్నారు. తుడా చైర్మన్ గా డాలర్స్ దివాకర్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత తుడా పరిధిలో లేవుట్ అప్రూవల్, భవన నిర్మాణాల అనుమతులు, అమలు తదితర అంశాల పై గతంలో ఎన్నడు లేని విధంగా రాష్ట్ర చరిత్రలో మొదటిసారి 4 మున్సిపాలిటీలు, 9 నియోజకవర్గాలు, 39 మండలాల ఎంపిడిఓ లు , 1100 పైగా గ్రామపంచాయతీల కార్యదర్శులకు అవగాహన సదస్సు బుధవారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, తుడా వైస్ చైర్మన్ జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశి, డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ సురేష్ నాయుడు, మున్సిపల్ డిప్యూటీ సిటీ ప్లానర్ మహబూబ్ ఖాన్,తుడా సెక్రటరీ శ్రీకాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తుడా సిటీ ప్లానింగ్ ఆఫీసర్ దేవీ కుమారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పంచాయతీ పరిధిలో కార్యదర్శులు అక్రమ లేఅవుట్లు ఎలా గుర్తించాలి, ఎలా అనుమతులు ఇవ్వాలి, భవన నిర్మాణాల అనుమతులు తదితర అంశాలను కూలంకుషంగా వివరించారు. అదేవిధంగా పంచాయితీ కార్యదర్శుల అనుమానలను నివత్తి చేశారు.

తుడా ఛైర్మెన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుపతి నగరానికి శ్రీవారి దర్శనర్థం ప్రతిరోజూ లక్షలాదిమంది ప్రజలు వస్తున్నారని, వారు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ప్రశాంతంగా దైవదర్శనం చేసుకొని సంతోషంగా తిరిగి వెళ్ళేవిధంగా అన్ని సౌకర్యాలు తుడా కల్పిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రి లోకేష్ కష్టపడుతున్నారని, వారి కష్టంలో భాగం కావాలన్న సంకల్పంతో తుడా అభివద్ధికి కష్టపడుతున్నామన్నారు. గత పాలకులు తుడాను భ్రష్టుపట్టించారాని మండిపడ్డారు. తాను తుడా ఛైర్మెన్ అయ్యాక తుడా ను గాడిలో పెడుతున్నామని చెప్పారు. తుడా పరిధిలోని అన్ని గ్రామపంచాయతీలలో ప్రజలకు అవసరమైన తాగునీరు, రోడ్లు, డ్రైన్లు, కరెంటు సౌకర్యం ఏర్పాటు చేయడానికి తుడా కషి చేస్తుందని చెప్పారు. అక్రమ లేవుట్స్ వలన క్రైమ్ రేటు పెరుగుతోందని, ప్రజలు అక్రమ లేఔట్స్ లో స్థలాలు కొని ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల అభివద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని అన్నారు. ప్రభుత్వ జీవోలను క్షుణ్ణంగా తెలుసుకుని వాటిని అమలు చేయాలని కోరారు.





## శ్రీసిటీలో కేంద్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి

**ప్రజాశక్తి - వరదయ్యపాలెం**

కేంద్ర గహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ కటికితల, ఆ శాఖ ఉన్నతాధికారులతో కలసి బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రణాళిక, ప్రస్థానం, పారిశ్రామిక ప్రగతి గురించి వివరించారు. శ్రీసిటీలో అభివద్ధి చెందుతున్న సామాజిక వసతులపై ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. గహ సముదాయాలు, విద్యా వసతులు, షాపింగ్ కేంద్రాలు, ఇతర కీలక సౌకర్యాల గురించి హైలైట్ చేశారు. అలాగే ఇక్కడ అమలు చేస్తున్న సమర్థవంతమైన నీటి వనరుల నిర్వహణ, మురుగునీటి రీసైక్లింగ్, ఘన వ్యర్థాల నిర్వహణ, హరితహిత చర్యలు, ఇతర సుస్థిరత కార్యక్రమాలను వివరించారు. టౌన్‌షిప్ ల అభివద్ధి ద్వారా "వాక్ టు వర్క్" ఆవశ్యకతను ప్రస్తావిస్తూ, ఇందుకోసం అవసరమైన సహకారం అందించాలని కార్యదర్శికి విన్నవించారు. కేంద్ర గహ నిర్మాణశాఖ (అమత్ పథకం) సంయుక్త కార్యదర్శి ఇషా కాలియా, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ ఎన్.మౌర్య, సాంకేతిక సలహాదారు రోహిత్ కక్కర్, సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి పాల్గొన్నారు.

# మామిడి రైతులకు అండగా...

- ఆంక్షల నడుమే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన
- పోలీసుల ఓవరాక్షన్‌తో బంగారుపాళ్యంలో ఉద్రిక్తత

**ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి), బంగారుపాళ్యం**

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వ హయాంలో కిలో మామిడి రూ.29లకు కొన్నామని, ప్రస్తుత ప్రభుత్వం రైతులకు కనీసం రూ.12 కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉందని ప్రశ్నించారు. కర్ణాటకలో కిలో రూ.16లకు కొనుగోలు చేస్తున్నారని, మామిడి రైతులకు పెట్టుబడి సాయం అందలేదని, వారి తరపున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. మామిడి రైతుకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అయితే ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటనకు 500 మంది కంటే అనుమతి లేదని, రోడ్డుషో నిర్వహించరాదని ముందస్తు ఎస్‌పి మణికంట చందోలు ఆంక్షలు విధించడం గమనార్హం.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం పర్యటన అధికార పార్టీ ఆంక్షలతో రసాభాసగా మారింది. బుధవారం ఉదయం బెంగళూరు నుంచి అరగొండ ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు జగన్ చేరుకున్నారు. అక్కడ 30 మందికి అనుమతి ఉండగా వందలాది మంది దూసుకురావడంతో హెలిప్యాడ్ వద్ద తోపులాట, తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఓ మహిళ కింద పడిపోయింది. ఈ క్రమంలోనే కాన్వాయ్ నుంచి వైఎస్ఆర్ పార్టీ కాంగ్రెస్ నేత విజయానంద రెడ్డి జారి కిందపడ్డారు. రోడ్ షో ర్యాలీకి అనుమతి లేనప్పటికీ.. హెలిపాడ్ నుంచి మార్కెట్ యార్డ్ వరకు పెద్దసంఖ్యలో వాహనాలతో రోడ్ షో నిర్వహించారు. ఆంక్షలు ఉల్లంఘించి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. దీంతో పోలీసులు స్వల్ప లాఠీ ఛార్జ్ చేశారు. మామిడి కాయల మండి వద్దే ఆయన ప్రెస్‌మీట్ నిర్వహించారు. బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో జగన్‌తో మాట్లాడేందుకు 500 మందికి పోలీసులు అనుమతించారు. అయితే జగన్ రాకముందే వైఎస్ఆర్సిపి కార్యకర్తలు భారీగా మార్కెట్ యార్డులోకి చొచ్చుకుని వెళ్లారు. దీంతో అక్కడ ఉద్రిక్తత, రసాభాస చోటు చేసుకుంది. తన పర్యటన ఆద్యంతం ఈ ఆంక్షలు ఏంటని జగన్మోహన్‌రెడ్డి ఎస్‌పి మణికంఠ చందోలుతో వాగ్వాదానికి దిగారు. ఈ ఘటనలో గాయపడిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడిని సిపిఎం చిత్తూరు జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నాయకులు కందారపు మురళి వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు.


ఆంక్షలు ఎదుర్కొంటూ మార్కెట్‌యార్డు వద్దకు భారీగా చేరుకున్న శ్రేణులు


వైసిపి శ్రేణులను వెనక్కిపంపుతున్న పోలీసులు

## తలకోన హుండీ ఆదాయం లెక్కింపు

**ప్రజాశక్తి-యర్రావారిపాలెం:** తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయం హుండీని మదనపల్లి దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్ శశికుమార్ ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. శాశ్వత హుండీ ద్వారా వంద రోజుల ఆదాయం లెక్కించగా రూ. 6లక్షల14వేల6వందల74 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సి రవీందర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ కమిటీ చైర్మన్ సోమనాథ్ రెడ్డి, కమిటీ సభ్యులు విఆర్‌ఓ మస్తాన్ పాల్గొన్నారు.



డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులుల

## డెంగీపై అవగాహన

**ప్రజాశక్తి -రేణిగుంట:** 'డెంగీని తరిమికొడదాం..' అని అవగాహన ర్యాలీని ఆర్‌సియం ఇంగ్లీష్ మీడియం హైస్కూలు విద్యార్థులతో బుధవారం నిర్వహించామని సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ దోమ కాటు ద్వారా ఆకస్మికంగా జ్వరంతో కూడిన కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు, కంటి లోపల భాగంలో నొప్పులు ఉంటే డెంగీ అని నిర్ధారించాలని కోరారు. దోమ కాటు ద్వారా వ్యాపించే ఈ జ్వరం ప్రమాదకరమన్నారు. జ్వరం, విపరీతమైన కండరాలు కీళ్లు, కళ్ల నొప్పులు వాంతులతో డెంగీ మొదలవుతుందన్నారు. కొంతమందికి శరీరంపై ఎర్రటి దద్దుర్లు, చిగుర్ల నుండి రక్తస్రావం ఉండవచ్చు అన్నారు. డెంగీ నిర్ధారణకు మొదటి వారంలో రాపిడ్ కిట్టుతో పరీక్షలు నిర్వహిస్తారని, గర్భిణులు, చిన్నపిల్లలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిలో ప్రమాదం కారణంగా ఈ జ్వరానికి త్వరగా చికిత్స చేసుకోవాలని కోరారు. సీజనల్ వ్యాధుల డెంగీ , చికెన్ గున్యా, మెదడువాపు, మలేరియా, బోదకాలు, వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురికినీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఎంఎల్‌హెచ్‌పి స్రవంతి సూచించారు. ఇంటిలో దోమల నివారణకు దోమతెరలు వాడా లన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త, ఆశ కార్యకర్తలు పద్మావతి, అశ్విని, విద్యార్థులు పాల్గొన్నారు.

**క్యాంపస్ :** శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు మారకద్రవ్యాల వినియోగ నివారణ, సైబర్ నేరాల నివారణల, మహిళలపై అఘాయిత్యాల నివారణపై అవగాహనా సదస్సు తిరుపతి మహిళా పోలీస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు బి. సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహిళా పోలీస్ స్టేషన్ సిఐ తమాం అహమ్మద్ యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టరు జే.కొండలరావు, డాక్టరు కె కోటేశ్వరయ్య, పి హరీష్ రెడ్డి, డాక్టరు బి త్రివేణి, ఎన్ జయలక్ష్మి, అధ్యాపకులు, బృందం విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## మల్లంగుంట సింగిల్ విండో చైర్మన్‌గా మధుశేఖర్

### సభ్యులుగా మోహన్ రెడ్డి, చిరంజీవి



మల్లంగుంట సింగిల్‌విండో నూతన చైర్మన్, సభ్యులు

**ప్రజాశక్తి -రామచంద్రాపురం (తిరుపతి రూరల్):** చంద్రగిరి నియోజక వర్గం తిరుపతి రూరల్ మండల పరిధిలోని మల్లంగుంట సింగిల్ విండో చైర్మన్‌గా చెరుకూరి మధు శేఖర్, సభ్యులుగా మోహన్ రెడ్డి, చిరంజీవి నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం వారు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, తమకు ఈ అవకాశం కల్పించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి మల్లంగుంట సింగిల్ విండో ద్వారా నిష్పక్షపాతంగా సహాయ సహకారాలు అందించాలన్నారు. చైర్మన్ మధు శేఖర్ మాట్లాడుతూ తమ సేవలు రైతులందరికీ అందుబాటులో వుంటా యని, రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## సప్తగిరి కాలనీ పంచాయతీ అధ్యక్షుడుగా అల్లా బాషా



**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ గ్రామపంచాయతీ గ్రామ కమిటీ టిడిపి అధ్యక్షులుగా అల్లాబాషా, ప్రధాన కార్యదర్శిగా సి. హరికృష్ణ నియమితు లయ్యారు. ఈ మేరకు నియోజకవర్గ శాసనసభ్యులు పులివర్తి నాని, రూరల్ మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి ఖరారు చేశారు.

## ఘనంగా వెంకట్ రాయల్ జన్మదినం



**ప్రజాశక్తి-తిరుపతి (మంగళం):** తిరుపతి గ్రామీణ మండలం తిరుచానూరు గ్రామ పంచాయతీ జనసేన అధ్యక్షులు వెంకట్ రాయల్ జన్మదిన వేడుకలను బుధవారం తిరుచానూరులో ఘనంగా నిర్వహించారు. వెంకట్ రాయల్ పుట్టినరోజు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, జనసేన స్టేట్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ మెంబర్ పసుపులేటి హరిప్రసాద్, టిడిపి సీనియర్ నాయకులు వూకా విజయ్ కుమార్, హేమంత్ కలిసి తిరుచానూరులో పేద ప్రజలకు అన్నదానం నిర్వహించారు.

## నూతన బోరు ప్రారంభం

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** మంగళం పరిధిలోని మంగళం -2వ గ్రామపంచాయతీ చంద్రబాబునాయుడు కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరును చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే నాని బుధవారం ప్రారంభించారు. సుపరిపాలనలు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళం పంచాయతీ చంద్రబాబు నాయుడు కాలనీలో కూటమి ప్రభుత్వం ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పెరుగు భాస్కర్ రెడ్డి, క్లస్టర్ ఇన్చార్జి ఈశ్వరయ్య, మండల ప్రధాన కార్యదర్శి గోపీనాథ్, చలపతి, పంచాయతీ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు సురేష్ నాయుడు, కార్యదర్శి రవిచంద్ర, మహిళా అధ్యక్షురాలు జానకి, వార్డు సభ్యులు నాగరాజు టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు మెగా పేరెంట్ టీచర్ సమావేశం

**ప్రజాశక్తి- రామచంద్రాపురం:** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు, మార్కండేయ నాయుడు, జయవేలు తెలిపారు. బుధవారం రామచంద్రపురం ఎంఆర్సి కార్యాలయంలో వారు మాట్లాడుతూ డొక్కా సీతమ్మ భోజన పథకం మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలన్నారు. నూతన విద్యా విధానంలో మోడల్ పాఠశాలల పనితీరు మెరుగుపరిచేందుకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో పాల్గొనే విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ప్రజా ప్రతినిధులకు, దాతలకు, విద్యావేత్తలకు భోజన వసతి కల్పిస్తున్నట్లు వారు తెలిపారు.

# మరో మైలురాయిని అధిగమించిన శ్రీసిటీ 'వీఆర్‌వీ'

## ఖతార్ ఎయిర్ లిక్విడ్ సంస్థకు ఉత్పత్తుల ఎగుమతి

**ప్రజాశక్తి- సత్యవేడు:** శ్రీసిటీలోని క్రయోజెనిక్ ట్యాంకుల తయారీ అగ్రగామి సంస్థ యుఎస్‌ఎ చార్ట్ ఇండస్ట్రీస్ కు చెందిన వీఆర్వీ ఆసియా పసిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ, ఖతార్‌లోని ఎయిర్ లిక్విడ్ సంస్థకు అధిక సామర్థ్యం కలిగిన (సూపర్-సైజ్డ్) లిక్విడ్ నైట్రోజన్ స్టోరేజ్ ట్యాంక్‌ను ఎగుమతి చేయడం ద్వారా మరో ప్రధాన మైలురాయిని అధిగమించింది. ఎయిర్ లిక్విడ్ ప్రపంచంలోని ప్రముఖ పారిశ్రామిక వాయువుల తయారీ ,సేవల సంస్థ. ఇది 75 కంటే ఎక్కువ దేశాలలో ఆరోగ్య సంరక్షణ, ఏరోస్పేస్ రంగాల పరిశ్రమలకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడంలో ప్రసిద్ధి చెందింది. ప్రస్తుతం ఎగుమతి చేస్తున్న 47 మీటర్ల పొడవు, 6 మీటర్ల వ్యాసం, 214 టన్నుల బరువు కలిగిన భారీ క్రయోజెనిక్ ట్యాంక్, విఆర్‌వి అధునాతన ఇంజనీరింగ్ సామర్థ్యాలకు ప్రతీకగా నిలుస్తోంది. ఇందుకు సంబంధించిన మొదటి ఎగుమతి ట్యాంకును 192 చక్రాల మల్టీ యాక్సిల్ వాహనం ద్వారా కృష్ణపట్నం పోర్టుకు తరలించారు. ఈ సరఫరా ద్వారా అంతరిక్ష రంగం అవసరాలకు అనుగుణంగా భారీ క్రయోజెనిక్ నిల్వ ట్యాంకుల తయారీలో ప్రపంచవ్యాప్తంగా వీఆర్‌వికి మరింత పేరు దక్కింది. ఆత్మనిర్భర్, 'మేక్ ఇన్ ఇండియా' చొరవ మేరకు నిబద్ధత, కృషితో కీలక రంగంలో ఎగుమతులు చేపట్టి మరో మైలురాయిని అధిగమించిన వీఆర్వీ సంస్థను ప్రశంసిస్తూ, వీఆర్వీ యాజమాన్యానికి సిబ్బందికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. శ్రీసిటీలో ప్రవేశించిన మొట్టమొదటి సంస్థ వీఆర్‌వి అని, దిగుమతులకు ప్రత్యామ్నాయంగా ఎగుమతులు చేపడుతూ ప్రపంచ సరఫరా గొలుసుకు దోహదపడుతున్న వీఆర్వీ పనితీరు స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. దేశంలో దాదాపు 17 సంవత్సరాలుగా నాణ్యత, నూతన ఆవిష్కరణలతో విఆర్‌వి సంస్థ, ఇస్రో, యుఎస్‌ఏలోని ఒక ప్రైవేట్ ఏరోస్పేస్ సంస్థతో సహా ప్రముఖ సంస్థలకు విశ్వసనీయ భాగస్వామిగా మారింది. వివిధ ద్రవ వాయువుల నిల్వ, పంపిణీ, బాష్పీభవనం కోసం ఉత్పత్తుల రూపకల్పన మరియు తయారీలో ప్రత్యేకత కలిగిన విఆర్‌వి



, క్రయోజెనిక్ సాంకేతికతను మరింత అభివృద్ధి చేయడం కోసం కృషి చేస్తోంది. కోవిడ్-19 సంక్షోభ సమయంలో కీలక పాత్ర పోషించి దేశవ్యాప్తంగా వైద్య ఆక్సిజన్ సిలిండర్లు, నిల్వ ట్యాంకులను విఆర్‌వి సరఫరా చేసింది. శ్రీసిటీ విరాళంగా తిరుపతి స్విమ్స్, బర్డ్, రుయా హాస్పిటల్స్ తో సహా తిరుపతి, నెల్లూరు జిల్లాలలోని ప్రభుత్వ ఆసుపత్రులకు అందచేసిన ఆక్సిజన్ నిల్వ ట్యాంకులను సకాలంలో సరఫరా చేసి వీఆర్‌వీ ఎంతో సహకరించింది.

## నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

**ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ:** సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని అందుకు అనుగుణంగా పనిచేస్తానని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. బుచ్చి నాయుడు కండ్రిగ మండలం పుత్తేరిలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం రూ.13 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రైనేజీకి ఎమ్మెల్యే ఆదిమూలం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ప్రజాసేవ చేయాలన్న సంకల్పంతోనే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. సర్పంచ్ స్థాయి నుండి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నుకుని ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన ప్రజలకు, ప్రతి ఒక్కరికి ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. అందరి సహకారంతో నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నోటు పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్:** 'ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ మోడల్ ప్రైమరీ స్కూల్, కొర్లగుంట మున్సిపల్ స్కూల్ విద్యార్థిని విద్యార్థు లకు ఆ సంస్థ వ్యవస్థాపకు రాలు తహసీ బేగం ఆధ్వర్యంలో ఉచిత నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఉప విద్యాధికారి బాలాజీ, కొర్రగుంట మున్సిపల్ హై స్కూలు ప్రధానోపాధ్యాయులు కే రవిచంద్రన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ ఖాదర్ బాష హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షురాలు తహసిన్స బేగం భర్త డాక్టర్ ఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేద విద్యార్థులకు మంచి చదువు అందించాలనే ఉద్దేశంతో సుమారు 20వేల రూపాయలు విలువచేసే నోటు పుస్తకాలు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పిజి విద్యార్థులకు బ్రిడ్జి కోర్స్ ప్రారంభం

**ప్రజాశక్తి - క్యాంపస్ :** జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతిలో నూతనంగా పిజి కోర్సుల్లో ప్రవేశించిన విద్యార్థులకు వారం రోజులపాటు అన్ని విషయాల పై సమగ్రంగా బోధించే బ్రిడ్జ్ కోర్స్‌ను విశ్వవిద్యాలయంలోని సభాభవనంలో బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వవిద్యాలయం అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్ల, సన్మానిత అతిథిగా స్కూల్ ఆఫ్ దర్శన డీన్ ప్రొఫెసర్ వి విష్ణు భట్టాచార్యులు విచ్చేసి దీపప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. అన్ని పిజి విభాగాల విద్యార్థులకు ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా మాట్లాడు తూ వారం రోజులపాటు సంస్కృత బాష, సంస్కృతంలో శాస్త్రీయ అంశాలకు సంబంధించిన పరిచయాత్మకమైన బోధన ఈ వారం రోజులపాటు వుంటుందని, విద్యార్థులు అన్ని శాస్త్రాల సమగ్ర జ్ఞానాన్ని సంక్షిప్తంగా ఈ బ్రిడ్జ్ కోర్స్ ద్వారా నేర్చుకోవచ్చని తెలిపారు. సన్మానిత అతిథి స్కూల్ ఆఫ్ దర్శన డీన్ ప్రొఫెసర్ వి విష్ణుబట్టాచార్యులు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో 14 పైగా శాస్త్రాలలో ఈ పిజి కోర్సెస్ నిర్వహిస్తున్నారని, అన్ని శాస్త్రాలకు సంబంధించిన సంక్షిప్త పరిచయాత్మక విశేషాలు ఈ కోర్స్ ద్వారా నేర్చుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా వ్యాకరణ విభాగం అధ్యక్షులు ప్రొఫెసర్ పంకజ్ కుమార్ వ్యాస్, వ్యాకరణ విభాగం సహాయక ఆచార్యులు డాక్టర్ యశస్వి అడిషనల్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు.

### వైసిపి ఆర్‌టిఐ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మల్లారపు శ్రీరాములు



**ప్రజాశక్తి -రామచంద్రాపురం(తిరుపతి రూరల్ ):** వైసిపి ఆర్‌టిఐ విభాగం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా మల్లారపు శ్రీరాములు నియమితులయ్యారు. తిరుపతి రూరల్ మండలం పుదిపట్ల గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు మల్లారపు శ్రీరాములుకు జిల్లా పార్టీకి అనుబంధ విభాగమైన ఆర్‌టిఐ విభాగం ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించారు. రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆశీస్సులతో చంద్రగిరి నియోజక వర్గం వైసిపి ఇన్ చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సిఫార్సు మేరకు ఆయనకు ఆర్‌టిఐ విభాగం ప్రధాన కార్యదర్శిగా అవకాశం దక్కింది. తనపై ఎంతో నమ్మకంతో పార్టీలో కీలక పదవిని అప్పగించిన తమ నాయకుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతూ తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పురోభివృద్ధికి పనిచేస్తానని మల్లారపు శ్రీరాములు స్పష్టం చేశారు.

## శ్రావణికి డాక్టరేట్



**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం న్యాయశాస్త్రం పరిశోధక విద్యార్థిని కీచగారి శ్రావణికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు యూనివర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయశాస్త్ర విభాగం ఆచార్యులు డి.సీతాకుమారి మార్గదర్శకత్వంలో "పబ్లిక్ హెల్త్ అండ్ ద లా ఇన్ ఇండియా.. ప్రొబ్లమ్స్ అండ్ పర్స్ పెక్టివ్స్" (భారతదేశంలో ప్రజారోగ్యానికి సంబంధించిన చట్టాలు, సమస్యలు, దృక్కోణం) అనే అంశంపై ఆమె తన పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు. ప్రభుత్వాలు, ప్రజలు కలిసికట్టుగా పనిచేస్తే, ఆరోగ్యకరమైన, సురక్షితమైన సమాజాన్ని నిర్మించవచ్చని సూచించారు. పారిశుధ్యం - పరిశుభ్రత, అంటువ్యాధుల నియంత్రణ, ఆహార భద్రత, జనన మరణాల నమోదు, చట్టాల అమలు, ప్రజల అవగాహన వంటి తదితర అంశాలను కె.శ్రావణి తన పరిశోధన గ్రంథంలో కూలంకశంగా వివరించారు. ఆమె పలు జాతీయ, అంతర్జాతీ య జర్నల్స్ లలో అనేక పరిశోధన వ్యాసాలను ప్రచురించారు. ఈ సందర్భంగా శ్రావణికి పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు, మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

## ట్యాబ్‌లు పంపిణీ



ఎంఆర్‌పిలకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గూడూరు మెప్మా రిసోర్స్ పర్సన్లు 77 మందికి రూ.32,999 విలువ చేసే ట్యాబ్‌లను ఎమ్మెల్యే సునీల్ కుమార్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్‌పిలను ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి మార్పు చేసే వారని తెలిపారు. వారి సమస్యలను గుర్తించి కూటమి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించిందన్నారు. ప్రతి ప్రభుత్వ పథకానికి అర్హులను చేర్చాల్సిన బాధ్యత ఆర్‌పీలపై వుందన్నారు. అనంతరం మెప్మా ఆర్‌పిల ఉద్యోగ పరిమితి మూడు సంవత్సరాల తొలగింపును రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో మెప్మా ఆర్‌పీలు గూడూరు టవర్ క్లాక్ సెంటర్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే సునీల్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు , మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పెంచలయ్య , సీవో చందన , ఉషా, పట్టణ సమాఖ్య అధ్యక్షులు సులోచనమ్మ, టిఎల్‌ఎఫ్‌ఆర్‌పిలు లక్ష్మీ, సుమతి , సుజాత పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు సన్మానం

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** స్థానిక పుత్తూరు దళితవాడలో నిర్వహించిన గంగజాతరకు వచ్చిన నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌ను టిడిపి నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎం అంకయ్య, మాజీ వైస్ చైర్మన్ ఎ ఆనంద్, గ్రామ పెద్దలు ఘనంగా ఆహ్వానించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, టిడిపి నాయకులు ఏలుమలై (అమ్ములు), మార్కెట్ కమిటీ చైర్మన్ డిఎస్ గణేష్, ఎస్‌సి సెల్ నాయకులు కుప్పయ్య, మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ, టిడిపి విక్కీ రాయల్, ప్రజలు పాల్గొన్నారు.





విజయకేతనం చూపుతున్న కళాశాల అధ్యాపక బృందంతో విద్యార్థులు

## సీఏ, సీఎంఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విద్యార్థుల ప్రభంజనం

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** తిరుపతి నగర పరిధిలోని ఎమరాల్డ్స్ ప్రొఫెషనల్ అకాడమీ విద్యార్థులు సిఏ, సీఎంఏ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం విడుదలైన సీఎంఏ ఫలితాలలో పి హర్షిత్ (326), బి నిరంజన్(296), డి తక్షిల్ (292' మార్కులతో 85.24 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. సిఏ ఫలితాలలో పి. హర్షిత్ 301, ఎం.బాలాజీ 290, బి. నిరంజన్ 289 మార్కులను సాధించి 47.37 శాతం ఉత్తీర్ణతను నమోదు చేశారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని ఈ సందర్భంగా డైరెక్టర్లు ప్రత్యేకంగా అభినందించారు.

## క్రెడాయ్ ఎక్స్‌పో బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న తుడ చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** సెప్టెంబర్ 5, 6, 7 తేదీలలో తిరుపతి నగరంలో క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో నిర్వహించ నున్నారు. ఇందుకు సంబంధించిన పరిచయ కార్యక్రమం బుధవారం తిరుపతిలోని పై వైస్రాయ్ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి క్రెడాయ్ ఎక్స్పో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను క్రెడాయ్‌లో ఒక సభ్యుడని నేడు తుడా ఛైర్మన్ హోదాలో ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. దిన దినాభివృద్ధి చెందుతున్న ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో సెటిల్ కావడానికి ఇతర ప్రాంత వాసులు అధికంగా ఇష్టపడుతున్నారని ముఖ్యంగా విల్లాస్, డూప్లెక్స్ హౌస్, అపార్ట్మెంట్లు అధికమవుతున్న తరుణంలో క్రెడాయ్ లాంటి నమ్మకమైన సంస్థ ప్రజల అవసరాలను గుర్తించి నిర్మాణాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. తాను తుడా చైర్మన్ అయిన తర్వాత దీర్ఘకాలిక అభివృద్ధి పైన దృష్టి సారించామని అందుకు తగ్గ ప్రణాళికలను చేస్తున్నామన్నారు. తిరుపతి చుట్టుపక్కల 25 కిలోమీటర్ల పరిధిలో ప్రత్యేక అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. క్రెడాయ్ సంస్థకు తుడా తరపున సంపూర్ణ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం క్రెడాయ్ సంస్థలో ఇంటర్ షిప్ చేసిన ఇంజనీరింగ్ విద్యార్థులకు తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ తిరుపతి చాప్టర్ చైర్మన్ గోపీనాథ్, ప్రెసిడెంట్ రాంప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ రాజేష్ బాబు, కార్యదర్శి నరసింహారెడ్డి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజిఎం దినేష్, ఇతర బ్యాంక్ అధికారులు, క్రెడాయ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అఖిల భారతీయ విసిల సదస్సులో ఎన్‌ఎస్‌యు విసి

**ప్రజాశక్తి - క్యాంపస్ :** భారతదేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల విసిల సదస్సు కర్ణాటకలోని ముద్దెనహళ్లి, సత్యసాయి గ్రామ, సత్యసాయి ప్రేమామృతం ఆడిటోరియంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయాల అభివృద్ధికి విసి చేయాల్సిన కార్యక్రమాలు, విద్యా వ్యవస్థను ఎలా ముందుకు తీసుకెళ్లాలి? రీసెర్చ్ ఇన్నోవేషన్ హబ్‌గా విశ్వవిద్యాలయాలను మరింత బలోపేతం చేయాలని, భారతదేశాన్ని విశ్వగురువుగా స్థాపించడమే లక్ష్యంగా అన్ని విశ్వవిద్యాలయాలు పనిచేయాలని, తదితర అంశాలపై చర్చించారు.

# సూపర్ సిక్స్ పథకాలు పేదలకు వరం: ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు పేదలకు ఒక వరం లాంటిదని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 16, 17వ వార్డులలో 'సుపరి పాలనకు తొలి అడుగు'కు ఎమ్మెల్యే హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన సూపర్ సిక్స్ పథకాలను, అన్న క్యాంటీన్, రోడ్లు, పుత్తూరులో అభివృద్ధి పనులు వివరించి కరపత్రాలు పంచిపెట్టారు. అభివృద్ధి పనులు, డ్రైనేజీ రోడ్ల సమస్యలు ఉన్నాయని ప్రజలు చెప్పడంతో వెంటనే మున్సిపల్ కమిషనర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎన్ ధనపాల్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, టిడిపి నాయకులు ఏలుమలై అమ్ములు, రవి శేఖర్ రాజు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ డిఎస్ గణేష్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ బిసిఆర్ యుగంధర్, మాజీ ఎస్‌సి సెల్ నాయకులు కుప్పయ్య, నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.



ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

**గూడూరు టౌన్ :** గూడూరు మండల పరిధిలోని విందూరులో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహణలో భాగంగా గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ పర్యటించారు. ఇంటింటికీ ప్రచారం నిర్వహించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. రూ.10 లక్షలతో నిర్మించిన సిసి రోడ్, 5 లక్షల రూపాయలతో నిర్మించిన శ్మశాన వాటిక ప్రహరీ గోడను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్ రెడ్డి , మట్టం శ్రావణి రెడ్డి , బొమ్మిరెడ్డి పెంచల్ రెడ్డి , ఏగిరెడ్డి మల్లికార్జురెడ్డి , కార్తీక్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**దొరవారిసత్రం :** మండల పరిధిలోని వేణుంబాక, పాలెంపాడు, నెలబల్లి, తదితర గ్రామాలలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ బుధవారం పర్యటించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాన్ని అందించి ప్రతి ఇంట్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వేణుంబాక గ్రామంలో రోడ్డు దుస్థితి గురించి ఎమ్మెల్యేకి తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శైలకుమారి, ఎస్‌ఐ అజయ్ కుమార్, ఏపిఎం మునిరాజా ఏపీఓ ఉష, వ్యవసాయ శాఖ అధికారి కిరణ్మయి, విద్యుత్ ఏఈ జగదీష్, హౌసింగ్ ఏఈ మోహన్, దొరవారిసత్రం టిడిపి నాయకులు పాల్గొన్నారు.

**శ్రీకాళహస్తి:** కూటమి ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని టీడీపీ నేతలు పేటా బాలాజీ రెడ్డి అన్నారు. పట్టణంలోని 96వ వార్డులో సూపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటా రమేష్, సుబ్బయ్య పాల్గొన్నారు.

## క్రైం న్యూస్

### వేర్వేరు ఇళ్లలో చోరీ

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:**

పట్టణంలోని పద్మశాలి పేటలో మంగళవారం రాత్రి రెండు ఇళ్లల్లో చోరీ చోటుచేసుకుంది. విజయలక్ష్మి ఇంట్లో 82 గ్రాముల బంగారం, 180 గ్రాముల వెండిని, మునిరాజా ఇంట్లో 16 గ్రాముల బంగారాన్ని దొంగలు దోచుకెళ్లారు. విజయలక్ష్మి భర్త కువైట్‌లో ఉండడంతో రాత్రి పూట తమ తల్లి ఇంట్లో ఇంట్లో నిద్రిస్తోంది. మునిరాజా కుటుంబం రాత్రి వేళల్లో డాబాపై నిద్రిస్తున్నారు. ఇదే అదునుగా దొంగలు ఇంట్లోకి చొరబడి బంగారం, వెండి దోచుకెళ్లడం గమనార్హం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి

- తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :**

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై అసభ్యకర, అనుచిత వ్యాఖ్యలు అన్యాయమని, వ్యాఖ్యలు చేసిన నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని వెంటనే అరెస్టు చెయ్యాలని తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. గూడూరు టిడిపి కార్యాలయంలో తెలుగు మహిళ నాయకు రాలు విలేకరులతో మాట్లాడుతూ సమాజానికి మంచి చేస్తూ, సేవా కార్యక్రమాలతో ముందుకు వెళుతున్న వేమిరెడ్డి కుటుంబం పై నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి అసభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేయ డం దారుణమన్నారు. ప్రజా ప్రతినిధులుగా ఇలాంటి భాష ఎవరైన వాడటం ఏమిటి? అని ప్రశ్నించారు. మహిళల పై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరం అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వైసిపి నేతలకే చెల్లుతుందన్నారు. ఇకనైనా వైసిపి నాయకులు మహిళలను గౌరవించాలని సూచించారు. ఈ సమావేశంలో లీలావతి, రూరల్ అధ్యక్షురాలు మల్లి శ్యామల, కల్పన, సుబ్బమ్మ, విజయమ్మ, అంకమ్మ పాల్గొన్నారు.

## పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే జైలు: సిఐ

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:**

విద్యా సంస్థలు నడిపే ప్రాంతాల్లోని దుకాణాల్లో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే జైలుకు పంపుతామని వన్ టౌన్ సిఐ గోపి హెచ్చరించారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో నిర్వహిస్తున్న పలు చిల్లర దుకాణాల్లో సిఐ గోపి తనిఖీలు చేపట్టారు. పలు దుకాణాల్లో పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. మొదటి తప్పుగా వారిపై కోప్టా చట్టం కింద జరిమానా విధించారు.

## వైసిపి సోషల్ మీడియా జాయింట్ సెక్రటరీగా యోగానంద రెడ్డి



**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** చిత్తూరు జిల్లా వైసిపి సోషల్ మీడియా జాయింట్ సెక్రటరీగా తిరుపతి గ్రామీణ మండలం బ్రాహ్మణ పట్టు పంచాయతీకి చెందిన ఎంపీటీసీ యోగానంద రెడ్డిని నియమించినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## చంద్రగిరిలో ఏడు సింగిల్ విండో చైర్మన్లు, సభ్యుల నియామకం



చేకూరి జనార్ధన్ చౌదరి

**ప్రజాశక్తి -రామచంద్రపురం :** చంద్రగిరి నియోజకవర్గంలో సింగిల్ విండో చైర్మన్, కమిటీ సభ్యుల నియామకాలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రతిపాదించిన ఏడుగురు సింగిల్ విండో చైర్మన్లు, 14 మంది కమిటీ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం అధికా రికంగా ఖరారు చేసి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకాలతో స్థానికంగా టిడిపి శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. తిరుపతి రూరల్ మండలం, తనపల్లి రఘునాథ్ రిసార్ట్స్ లోని టిడిపి కార్యా లయంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ఐతేపల్లి, నరసింగాపురం, పాకాల, యర్రావారిపాలెం, రామచంద్రాపురం, మల్లంగుంట, చిన్నగొట్టిగల్లు సింగిల్ విండోలకు చైర్మన్లు, కమిటీ సభ్యులను గతంలో ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రతిపాదించారు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

**రామచంద్రపురం సింగిల్ విండో:** చైర్మన్‌గా చేకూరి జనార్దన్ చౌదరి, సభ్యులుగా ఎ చిరంజీవి, ఎం చిరంజీవి నియమితులయ్యారు.

**ఐతేపల్లి సింగిల్ విండో:** చైర్మన్‌గా పల్లెనేని సుబ్రహ్మణ్యం నాయుడు, సభ్యులుగా బి భాస్కర్ బాబు, ఎం. వెంకటముని నియమితులయ్యారు.

**నరసింగాపురం సింగిల్ విండో:** చైర్మన్‌గా రాజులంగారి వినోద్ కుమార్ రెడ్డి, సభ్యులుగా బి ఉమామహేశ్వరావు, టి రెడ్డప్పశెట్టి నియమితులయ్యారు.

**పాకాల సింగిల్ విండో:** చైర్మన్‌గా సావిత్రి కృష్ణమనేని, సభ్యులుగా జి ఆనంద్, పి కిరణ్ కుమార్ నియమితులయ్యారు.

**చిన్నగొట్టిగల్లు సింగిల్ విండో:** చైర్మన్‌గా ఎం ప్రభాకర్, సభ్యులుగా జి శోభారాణి, పి అలివేలమ్మ నియమితులయ్యారు.

**యర్రావారిపాలెం సింగిల్ విండో:** చైర్మన్‌గా ఎస్ రఘు, సభ్యులుగా పి నాగరాజా, డి దేవేంద్ర నాయుడు నియమితులయ్యారు.

**మల్లంగుంట సింగిల్ విండో:** చైర్మన్‌గా సి మధు శేఖర్, సభ్యులుగా వి చిరంజీవి, పి మోహన్ రెడ్డి నియమితులయ్యారు.

ఈ నియామకాల సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ నూతనంగా నియమితులైన చైర్మన్లు, కమిటీ సభ్యులు ప్రభుత్వానికి వన్నె తెచ్చే విధంగా, సమర్థవంతంగా విధినిర్వహణలో భాగస్వాములై కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ నియామకాలు స్థానిక వ్యవసాయ రంగం అభివృద్ధికి, రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతనంగా నియమితులైన సింగల్ విండోల చైర్మన్లు, కమిటీ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా మా కక్షిదారుడైన **బందన్ బ్యాంక్, తిరుపతి బ్రాంచ్,** బ్రాంచ్ మేనేజర్ వారి సూచనలమేరకు ఇచ్చిన బోగట్టా ప్రకారం తిరుపతి జిల్లా, తిరుపతి పట్టణము ఫ్లాట్ నెం. 309, 3వ ఫ్లోర్, స్వర్ణముఖి టవర్స్‌లో నివసించు **శ్రీమతి బి.గీతాలక్ష్మి, భర్త బి. రాజశేఖర్** కి సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్ లింక్ డాక్యుమెంట్ నెం. 7629/2011 తేది:12-12-2011 స్థిరాస్తికి సంబంధించిన లింక్ డ్యాకుమెంట్స్ దారిపోయినవి. సదరు డాక్యుమెంట్స్ ఎంత వెతికిననూ దొరకలేదు. సదరు డాక్యుమెంట్స్ ద్వారా **గీతాలక్ష్మి బియ్యపు** ఈ క్రింది షెడ్యూలుపై నకలు పత్రము ద్వారా లోన్ మంజూరు చేయుటలో ఎవ్వరికైననూ ఎలాంటి అభ్యంతరములు ఉన్నచో ఏడు రోజులలోగా మీకు గల అభ్యంతరములను వ్రాతపూర్వకముగా తెలియపరచవలసినది. లేని ఎడల ఎటువంటి అభ్యంతరములు లేవని భావించి లోను మంజూరు చేయబడును.

**షెడ్యూలు :** చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రి.డి., తిరుపతి, రేణిగుంట సబ్.డి., తిరుపతి రూరల్ మండలం, పద్మావతిపురం పంచాయితీ, 10వ వార్డు తనపల్లి రోడ్డు, రెసిడెన్షియల్ ఏరియా, తిరుచానూరు గ్రామ లెక్కదాఖలా సర్వేనెం. 250/7, 250/8 మొత్తం విస్తీర్ణము 2614.66, చ.గ.॥లలో 1430 చ.అ.॥లు లేదా 42.86 చ.గ.లు. ఫ్లాట్ నెం. 309కి హద్దులు తూర్పు : కారిడార్ & ఓపెన్ స్కై, వెస్ట్ ఓపెన్ టు స్కై, నార్త్ : ఓపెన్‌టు స్కై , సౌత్ : ఓపెన్ టు స్కై.

**నగరం సునీల్ కుమార్,** అడ్వకేట్,కుమ్మరతోపు,తిరుపతి. సెల్:9440259259

# విజ్ఞాన నిలయం విద్యార్థుల కోసం నిరీక్షణ

- పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి చేతులు కలపండి
- కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి పిలుపు

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్:** 1983లో స్థాపించిన పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనేక మంది విద్యార్థుల జీవితాలను వెలుగులోకి తీసుకువచ్చిన విద్యా కేంద్రంగా నిలిచింది. ప్రస్తుతం ఎన్ ఎన్ ఎ సిసి బి గ్రేడ్‌ను పొందిన ఈ కళాశాల, విద్యా ప్రమాణాల్లో నిరంతర అభివృద్ధితో ఏ లేదా ఏం గ్రేడ్ లక్ష్యంగా ముందుకు సాగుతోందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి పేర్కొన్నారు. కళాశాలలో ఉన్న ముఖ్య వసతులలో 50,000 పుస్తకాలతో గ్రంథాలయం, అధునాతన ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూములు, 45 మంది అర్హత కలిగిన అధ్యాపకులు (వారిలో 30 మందికి పైగా పీహెచ్‌డీలు), ఉచిత పోటీ పరీక్షల శిక్షణ, విశాలమైన క్రీడా మైదానాలు, స్కిల్ హబ్ ద్వారా శిక్షణలు, ఎన్‌సిసి, ఎన్ఎస్–ఎస్ కార్యకలాపాలు ఉన్నాయి. అయితే, ఇటీవల కాలంలో కళాశాలలో అడ్మిషన్లు గణనీయంగా తగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో, కళాశాల యాజమాన్యం పూర్వ విద్యార్థుల సహకారాన్ని కోరుతోంది. మీరు చదివిన కళాశాలకు కృతజ్ఞతగా ఒక విద్యార్థిని కళాశాలవైపు మళ్లించండి' అని పూర్వ విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

పరిధిలోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ సమాచారాన్ని చేరవేయడం ద్వారా నూతన విద్యార్థులకు మార్గం చూపొచ్చు. సోషల్ మీడియా ద్వారా కళాశాల విశిష్టతలు తెలియజేయడం, అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పాటు ఇవ్వడం ద్వారా పూర్వ విద్యార్థులు తమ పాత్రను పోషించాలని కళాశాల ప్రిన్సిపల్ పేర్కొన్నారు. మన కళాశాల, మన బాధ్యత అనే నినాదంతో ముందుకు సాగేందుకు అందరూ సహకరించాలని కళాశాల యాజమాన్యం కోరుతోంది.




# ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీల్లో ఎంబీఏ సీట్లు

- పుత్తూరుకు చెందిన నీలం అఖిల్‌కు అరుదైన గౌరవం ఒకే సమయంలో ఆక్స్‌ఫర్డ్, బర్కిలీ యూనివర్సిటీల నుండి
- ప్రవేశాలు పొంది రూ.80 లక్షల స్కాలర్‌షిప్

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** పుత్తూరుకు చెందిన యువత గర్వించదగ్గ విజయాన్ని పుత్తూరుకు చెందిన నీలం అఖిల్ సాధించారు. పుత్తూరు ఎన్‌జిఒ కాలనీకి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు నీలం ప్రభాకర్, అంజలి దంపతుల పెద్ద కుమారుడైన అఖిల్ నీలం ఒకేసారి ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్కిలీ (హాస్ బిజినెస్ స్కూల్), ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ (సైడ్ బిజినెస్ స్కూల్) ల నుంచి ఎంబీఏ ప్రవేశాలు పొందారు. అఖిల్‌కి అందిన ఈ అరుదైన అవకాశానికి తోడు, ఆయనే స్వయంగా పొందిన 80 లక్షల ( యుఎస్‌డి 100,000కు పైగా) రూపాయల స్కాలర్‌షిప్ కూడా చెప్పుకోదగిన విషయం. పుత్తూరులో విద్యకు పునాది వేసుకున్న అఖిల్ తదుపరి శాస్త్రా యూనివర్సిటీలో బాచిలర్స్ పూర్తి చేసి, అశోకా యూనివర్సిటీ (డిల్లీ), ఐస్లాండ్‌లోని విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు అంతర్జాతీయ సంస్థలతో కలిసి లింగ సమానత్వంపై కీలక ప్రాజెక్టులు నిర్వహిస్తున్నారు. ఆయన స్థాపించిన సెంటర్ ఫర్ జెండర్ అండ్ పాలిటిక్స్ (సిజి పి)అనే స్వచ్ఛంద సంస్థ దక్షిణాసియాలో మహిళల రాజకీయ నాయకత్వాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో పనిచేస్తోంది. అఖిల్ భారత్ తరపున ఐక్యరాజ్యసమితి, యు ఎన్ విమెన్, జి 20 వేదికలపై మహిళా సాధికారత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశాలపై ప్రాతినిధ్యం వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పిఏఎల్ (పర్సనాలిజడ్ ఆడపిటివ్ లెర్నింగ్), ఆనంద వేదిక వంటి విద్యా పథకాల అమలులో కూడా ఇతని పాత్ర ప్రశంసనీయం. ఆసియా ఖండంలోని పలు దేశాల్లోని సెమినార్లు, చర్చల్లో పాల్గొన్న అఖిల్ అనేక అంతర్జాతీయ అవార్డులను గెలుచుకున్నారు. మహిళలకు రాజకీయంగా సమాన హక్కులు కలిగే వరకూ నా పోరాటం కొనసాగుతుంది అంటూ ఆయన చెప్పిన మాటలు యువతకు స్పూర్తిదాయకం..



అవార్డు స్వీకరిస్తున్న పుత్తూరుకు చెందిన విద్యార్థి నీలం అఖిల్ (ఫైల్ ఫొటో)

# తిరుపతి పట్టణాభివృద్ధికి సహకారం

కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ కటికితల

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** తిరుపతి పట్టణ సమగ్రాభివృద్ధికి సాంకేతిక, పర్యవేక్షణ సహకారం అందిస్తామని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్ శ్రీనివాస్ కటికితల పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో తిరుపతి పట్టణ సమగ్రాభివృద్ధిపై స్టేక్‌హోల్డర్లతో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి, ఆ శాఖ సంయుక్త కార్యదర్శి (అమృత్ పథకం) ఇషా కాలియా, సాంకేతిక సలహాదారు రోహిత్ కక్కర్ , తిరుపతి కలెక్టర్ డాక్టరు ఎస్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్ మౌర్య తో కలసి సమీక్షా సమావేశం నిర్వహించి సంబందిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ కటికితల మాట్లాడుతూ జనాభాల అవసరాల ప్రాతిపదికన ప్రణాళికలు రూపొందిం చాలన్నారు. జనసాంద్రత ఆధారంగా మౌలిక సదుపాయాల రూపకల్పన జరగాలని, నగరాల విస్తరణకు బదులుగా అందులోని ఖాళీ భూములను వినియోగించి తద్వారా ఎక్కువ మందికి సేవలందించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని ఇదే అభివృద్ధికి సమర్థవంతమైన మార్గమని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. విస్తృత ఆర్థిక జోన్ అభివృద్ధి ద్వారా తిరుపతి ప్రాంతానికి కొత్త రూపురేఖలను తీసుకురావాలన్నదే లక్ష్యం అన్నారు. పర్యాటకాన్ని కేవలం దర్శనానికే పరిమితి కాకుండా ఈ ప్రాంతంలో రాత్రి వసతితో కూడిన ప్యాకేజీలుగా మార్చడం ద్వారా వ్యాపార వృద్ధికి దోహద పడుతుందన్నారు. పెట్టుబడులను మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉపయోగించి వృద్ధి అవకాశాలను అధికంగా పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని ఇందుకు విజయవాడలోని కాళేశ్వర్ రావు మార్కెట్ లాంటి వ్యాపార కేంద్రాలను ఉదహరించారు. దీంతో పాటుగా హైదరాబాద్‌లోని బేగం బజార్ లాంటి మార్కెట్లు వందల కోట్ల వ్యాపారం చేస్తాయని, ఈ తరహా క్లస్టర్లను ఇతర నగరాల్లో కూడా గుర్తించి అభివృద్ధి చేయడం ద్వారా విస్తృత ఆర్థిక ప్రభావం చూపవచ్చన్నారు. భారతదేశంలో పెళ్లిళ్ల పరిశ్రమ విలువ సుమారు లక్ష కోట్లని , తిరుమలలో పెళ్లిళ్లకు వచ్చే వారికి వారి అవసరాలకు తగిన విధంగా సదుపాయాలు లేక పోవడం వల్ల ఈ అవకాశాన్ని వినియోగించుకోలేక పోతున్నామన్నారు. ఇందుకోసం తిరుపతిని డెస్టినేషన్ వెడ్డింగ్ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేడు మానవుని సగటు జీవిత కాలం పెరిగిన నేపథ్యంలో ప్రస్తుతం భారత దేశం యవ్వనంగా ఉన్నా, త్వరిత గతంగా వృద్ధాప్య దశలోకి అడుగుపెడుతోందన్నారు. ఇలాంటి సందర్భాల్లో వృద్ధులకు సేవలు అందించడం కోసం సహాయక జీవన కేంద్రాలను వైద్య సదుపాయాలతో కలిపి అభివృద్ధి చేయాలన్నారు. ఆయా ప్రాంతంలో ఉన్న పోర్టుల అభివృద్ధికి కూడా ప్రణాళికలు రూపొందిం చాలన్నారు. కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిరుపతి జిల్లా భోగోళిక పరిస్థితులను వివరిస్తూ కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి సూచనలకు, సలహాలకు అనుగుణంగా సంబంధిత అధికారులతో సమన్వయంతో చేసుకొని తిరుపతి పట్టణ సమగ్రాభివృద్ధికి సంపూర్ణ ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ...తుడా మాస్టర్ ప్లాన్ తిరుపతి అర్బన్ డెవలప్ మెంట్ పరిధిలోని ప్రాంతాల అభివృద్ధి కోసం రూపొందించిన సమగ్ర ప్రణాళికను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరిస్తూ తుడా పరిధిలో సుమారు 25 లక్షల జనాభా ఉన్నారని అయితే ప్రస్తుతం 9 లక్షలు మందిని మాత్రమే కవర్ చేశామన్నారు. తుడా పరిధిలో చేపట్టిన, చేపడుతున్న పనుల వివరాలు గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విపులంగా వివరించారు. తిరుపతి నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ కింద 83 ప్రాజెక్టులు పూర్తి కాగా, 14 ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షీ , మునిసిపల్ అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ్, అసోసియేట్ ప్రొఫెసర్, తిరుపతి స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు గోమతి, తులసి కుమార్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్


సమ్మెకు మద్దతుగా ఎస్‌వియు ఏడీ బిల్డింగ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

## కష్టజీవులకు అండగా విద్యార్థి సంఘాలు

**ప్రజాశక్తి - క్యాంపస్ :** దేశ వ్యాప్తంగా చేపట్టిన సమ్మెకు 'మేము సైతం' అంటూ ఎస్వీ యూనివర్సిటీలో పెద్ద ఎత్తున విద్యార్థులు ఏడీ బిల్డింగ్ ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి తమ తల్లిదండ్రుల పని దినం పై దాడి చేస్తోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి, అధ్యక్షులు అక్బర్, ఏఐఎస్ఎ జిల్లా కార్యదర్శి చిన్న, పిడిఎస్ఓ జిల్లా కార్యదర్శి ఆశ, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి లోకేష్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, ఉదయ్ లు మాట్లాడుతూ దేశంలోని కార్మికుల( తమ తల్లిదండ్రుల) ఆదాయం రోజు రోజుకీ తగ్గిపోతుందని, ఎంత కష్టపడినా అప్పులు తప్ప ఆదాయలు లేక తమ చదువులు కూడా ఒకపూట తిని తినకుండా కష్టపడి చదివిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లేబర్ కోడ్స్ వల్ల కార్మికుల హక్కులు అన్నిటిని కాలరాసి కార్పొరేట్ శక్తులకు దోచుకోడానికి మరింత సులువుగా ఈ చట్టాలు ఉన్నాయని, అందరూ ఈ లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జీఎన్ ఎస్ శివ శంకర్, జిజెఎస్ మహేంద్ర నాయక్, జెబిఎస్‌యు భార్గవ్, ఎస్ఎఫ్ఐ వర్సిటీ ప్రెసిడెంట్ నరసన్న, గీత, శివ, బాలాజీ, యోగి, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'సత్యసాయి జయంతి వేడుకలను జయప్రదం చేయండి'

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గూడూరు పట్టణంలోని కుమ్మరి వీధిలోని సత్యసాయి సేవా సమితి సభ్యులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఈనెల 11వ తేదీ శుక్రవారం సత్యసాయి అవతార శతజయంతి ఉత్సవ వేడుకల్లో భాగంగా స్వామివారి దివ్య ప్రేమ శాశ్వత సందేశాన్ని దేశమంతట వ్యాప్తి చెందేలా చేపట్టిన పవిత్ర యాత్ర శ్రీ సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర గూడూరు పట్టణానికి చేరుకుం టుందన్నారు. సత్యసాయి సేవా సమితి ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కె దాము ప్రతాప్, సేవాదళ్ కోఆర్డినేటర్ మల్లికార్జున్, ఆధ్యాత్మిక కోఆర్డినేటర్ బి సుబ్బారావు, శ్రీనివాస్, అరుణ్, నితీష్, లలిత, గౌతమి, భాగ్యలక్ష్మి, సుభాషిణి, సుప్రియ పాల్గొన్నారు.




## ఎడ్యుకేషనల్ మెటీరియల్స్ సంపిణీ

**ప్రజాశక్తి-పలమనేరు:** పలమనేరు పట్టణం భవిత సెంటర్ నందు దివ్యాంగ విద్యార్థులకు ఎడ్యుకేషన్ మెటీరియల్స్ ఆట వస్తువులు ఫ్రూట్స్, స్వీట్స్ అందించారు. మదనపల్లి పట్టణానికి చెందిన ధాత్రి ఫౌండేషన్ ఫౌండర్ స్వాతి చక్రపాణి, ఐఇఆర్పిఎస్ మంగేశ్వరి మురళి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ బాల సుందర్ ప్రత్యేక ప్రతిభావంతులు, దివ్యాంగ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆశాజ్యోతి దివ్యాంగుల పేద ప్రజల సేవా సంస్థ అధ్యక్షుడు రామానాయుడు ఉపాధ్యక్షుడు సుబ్బమ్మ కార్యదర్శి రమేష్ ఉప కార్యదర్శి భూలక్ష్మి కోశాధికారి హరికృష్ణ, ఈసీ మెంబర్స్ భాగ్యలక్ష్మి, దొరబాబు, కనకమ్మ, గోవిందు, వేణుగోపాల్, జావిద్, ప్రత్యేక ప్రతిభావంత విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.